ట్రాఫిక్ పద్మవ్యూహం

విస్తరణకు నోచుకోని రోడ్లు
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- నిత్యం ట్రాఫిక్ రద్దీతో వాహనదారులు సతమతం
- ఫుట్‌పాత్‌లు లేక ప్రాణాలు కోల్పోతున్న పాదచారులు


లారీ ఢీకొనడంతో మృత్యువుపాలైన లక్ష్మమ్మ(ఫైల్)

కావలి చుట్టపక్కల గ్రామాలకు చెందిన వేలాది మంది నిత్యం ఉపాధి, వ్యాపారాలు, ఇతర అవసరాల నిమిత్తం కావలి పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. అలా ఉపాధి నిమిత్తం వచ్చిన మహిళ గద్దె లక్ష్మమ్మ. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరుకు చెందిన లక్ష్మమ్మ కావలి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయాగా పని చేస్తోంది. శనివారం డ్యూటీ ముగించుకుని ఇంటికి ట్రంక్‌రోడ్డులో వెళ్తుండగా లారీ ఢీకొనడంతో చక్రాల కింద నలిగి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ట్రంకురోడ్డులో ఫుట్‌పాత్‌లు లేవు. కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లేవు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయంలో ఏ వాహనం ఎటు వైపు నుంచి వస్తుందో తెలియదు. ఈ కారణాలతో లక్ష్మమ్మకు జరిగినటువంటి ప్రమాద ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.


ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వద్ద అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

కావలి: పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. పట్టణ జనాభా సైతం భారీగా పెరిగింది. మరోవైపు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని వందలాది గ్రామాలకు చెందిన ప్రజలు కావలికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో గ్రామాల నుంచి వచ్చే బైక్‌లు, కార్లు, ఆటోలు, బస్సులు పెరిగిపోయాయి. అలాగే కావలి పట్టణవాసుల వాహనాలు విపరీతంగా పెరిగాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. అందుకనుగుణంగా పట్టణంలోని ప్రధానమైన ట్రంక్‌రోడ్డుతో పాటు అంతర్గత రహదారులు విస్తరణకు నోచుకోలేదు. దీనికి తోడు పట్టణంలో పార్కింగ్ ప్రదేశాలు లేక వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ సమస్యతో పట్టణ ప్రజలు సతమతమవుతున్నారు.

రోడ్లపైనే వాహనాలు

ట్రంకురోడ్డు ఎన్నో ఏళ్లుగా విస్తరణకు నోచుకోలేదు. ఇరుకుగా ఉండే ఈ రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు పాదచారులు, తోపుడు బండ్లతోనూ రద్దీగా ఉంటుంది. ట్రంక్‌రోడ్డులో నిత్యావసరాల దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, హోటళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, తదితరాలు ఉన్నాయి. వాటికి వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా ట్రంకురోడ్డు మరింత కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, ఉదయగిరి బ్రిడ్జి సెంటర్, రైతు బజారు సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డుకు వెళ్లే సెంటర్, పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్, వాయునందన ప్రెస్‌వీధి కూడలి, తదితర చోట్ల ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది.


ఇరువైపులా బైక్‌ల పార్కింగ్‌తో కుచించుకుపోయిన ట్రంక్‌రోడ్డు

ఫుట్‌పాత్‌లు లేక..

పట్టణంలోని ట్రంకురోడ్డులో ఎక్కడా పార్కింగ్ ప్లేసులు, ఫుట్‌పాత్‌లు లేవు. ట్రంకురోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా పాదచారులు ట్రంకురోడ్డుపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో ట్రంకురోడ్డును దాటేందుకు పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ రద్దీ సమయంలో ఏ పక్క నుంచి ఏ వాహనం వస్తోందో కూడా తెలియని పరిస్థితిలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


రైతుబజారు వద్ద రోడ్డుపైనే ఆటోల పార్కింగ్

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సి వస్తోంది



ట్రంక్‌రోడ్డు నిత్యం ట్రాఫిక్‌రద్దీ ఉంటోంది. పాదచారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సి వస్తోంది. పొట్టిశ్రీరాములు సెంటర్‌లో పరిస్థితి మరీదారుణం. ట్రంకురోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల పాదచారులు రోడ్డుపైన నడవాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. టంకురోడ్డును విస్తరించడంతో పాటు ఫుట్‌పాత్‌లు నిర్మించాలి. ట్రంకురోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు తీసుకోవాలి.
–సీ శారద, ఉమెన్స్ ఫోరం ప్రతినిధి, కావలి.

ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రధానమైన రోడ్డు కావడం, వ్యాపార సంస్థలు ఉండడంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటోంది. టూటౌన్,వన్‌టౌన్ పోలీసులు సమన్వయంతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతో రోడ్డు మార్జిన్ వ్యాపారులు రోడ్డు పైకి రాకుండా మార్కింగ్ చేయించాం. వాహనాల పార్కింగ్ సమస్యపైన దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు క్రమశిక్షణతో ట్రాఫిక్‌కు సహకరించాలి.
–ఎండీ ఫిరోజ్, సీఐ, కావలి వన్ టౌన్



బస్తా జారితే ప్రమాదమే

రేషన్ బియ్యం బస్తాలను కూలీలు ప్రమాదకరంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్‌లో బస్తాలను ఎత్తుగా లోడ్ చేసుకుని తాళ్లతో కట్టకుండా తీసుకెళ్తున్నారు. కూలీలు సైతం వాటిపైనే కూర్చుని ప్రయాణిస్తున్నారు. బస్తాలు ఏ మాత్రం జారినా కూలీలు కిందపడిపోయి గాయాలపాలయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు రద్దీగా ఉండే రోడ్లపై వెళ్లే క్రమంలో వాహనచోదకులు, పాదచారుల మీద బస్తాలు పడితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ దృశ్యం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో సాక్షి కంటపడింది.
–కావలి

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలలో పదో ఆంధ్ర నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సయ్యద్ హయ్యూల్‌హయ్యూమ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ వై కల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. దేశభక్తి పెంపొందుతుందన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ స్థాపన, దినదినాభివృద్ధి చెందిన విధానాన్ని వివరించారు. ఎన్‌సీసీ కేడెట్స్ కుటుంబానికి, దేశానికి ఎలా ఉపయోగపడాలో ఎన్‌సీసీ నేర్పుతుందన్నారు. దేశానికి ఎన్‌సీసీ ఒక మూల స్తంభమన్నారు. విద్యార్థులు దేశభక్తి కలిగి సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. అనంతరం 2022–2024 బ్యాచ్‌కు చెందిన క్యాడెట్స్‌కు 'ఏ' సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల వైస్‌చైర్‌పర్సన్ చల్లా శ్రీనివాసులు, జీవశాస్త్ర అధ్యాపకులు కేఎస్‌కే అంజాద్‌అలీ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరుపయోగంగా పశువైద్యశాల భవనం



కావలి: అన్నగారిపాళెం పంచాయతీ పరిధిలోని తుమ్మలపెంటలో పశువైద్యశాల భవనం నిరుపయోగంగా మారింది. గతంలో గ్రామంలో పశువైద్యశాల ఉండగా దానిని ఎత్తివేశారు. అప్పట్నుంచి ఆలనాపాలనా కరువవడంతో భవనం దుస్థితికి చేరుకుంది. మరోవైపు పశువైద్యసేవలు అందక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోలీసులకు శిక్షణా తరగతులు



కావలి: కావలి కోర్టు ప్రాంగణంలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాల్‌లో పోలీసులకు ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. కావలి కోర్టు పరిధిలో విధులు నిర్వర్తించే సీఐలు, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లకు ఏపీపీలు రామకృష్ణ, కే మృదుల సంయుక్తంగా పోలీసు ప్రొసీజర్‌పై శిక్షణ ఇచ్చారు. నిందితులను అరెస్టు చేయడం, కోర్టుకు హాజరుపరచడం, రిమాండ్‌కు తరలించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కావలి ఐఎంఏకు పురస్కారాలు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ కామంచి సుబ్బారావు

కావలి: కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ను మూడు పురస్కారాలు వరించాయి. ఉత్తమ ప్రదర్శన, సేవాభావం, ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహణ విభాగాల్లో అవార్డులు దక్కాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 66వ వార్షిక అవార్డుల ప్రదానోత్సవాన్ని శనివారం రాత్రి గుంటూరులో నిర్వహించారు. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్, సెక్రటరీ డాక్టర్ అనిల్‌కుమార్, జే నాయక్ అవార్డులను ప్రదానం చేశారు. కావలి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కామంచి సుబ్బారావు, సెక్రటరీ డాక్టర్ వీ గోపి, ట్రెజరర్ డాక్టర్ పాములూరు శివప్రసాద్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావలి వైద్యుల ఐక్యత, సేవాభావంతోనే అవార్డులు దక్కాయని పేర్కొన్నారు.

పక్కాగృహాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం పీఎంఏవై 2.0 పథకం కింద పేదలకు పక్కాగృహాలను మంజూరు చేస్తోందని ఆత్మకూరు మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ శరత్ ఆదివారం తెలిపారు. అర్హులైన వారు కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ, బ్యాంక్ ఖాతా, ఉపాధి జాబ్‌కార్డు, పాన్‌కార్డు, తదితరాలతో సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం దరఖాస్తులను పరిశీలించి పక్కాగృహాలను మంజూరు చేస్తుందని తెలిపారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామీణ జీవన విధానానికి జానపద కళలు ప్రతిబింబాలు



మాట్లాడుతున్న ప్రధాన వక్త కొల్లా వెంకటేశ్వర్లు

ఆత్మకూరు: గ్రామీణుల జీవన విధానానికి ప్రతిబింబాలైన జానపద కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధాన వక్త కొల్లా వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహించే మంచి మాట కార్యక్రమాన్ని పట్టణంలోని గ్రంథాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళలు ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమిస్తూ వస్తున్నాయన్నారు. సామాన్య ప్రజల జీవన పరిస్థితులు, ఆచారాలు, సంప్రదాయాలను జానపద కళలు ప్రతిబింబిస్తాయన్నారు. జానపద కళలు గ్రామీణ ప్రాంత ప్రజల దైనందిన జీవితంలో భాగమన్నారు. పండగలు, వివాహాలు, పంట కోతల సందర్భాల్లో ఈ కళలను ప్రదర్శిస్తారన్నారు. జానపద కళలు ప్రజల సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో కీలకపాత్ర వహిస్తాయన్నారు. వీటి ద్వారా ప్రజలకు వినోదంతో పాటు జ్ఞానం కూడా అందుతుందన్నారు. జానపద కళలు నేడు కనుమరుగవుతుండడం దురదృష్టకరమన్నారు. వాటి పరిరక్షణకు, ప్రోత్సాహానికి ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షులు అంకినపల్లి గోవిందరెడ్డి, సహాధ్యక్షులు కొల్లా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులు ఎస్వీ రమణయ్య, ఎస్ యానాదిరెడ్డి, కేవీ శేషారెడ్డి, వీ నారాయణరావు, సహ ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, ఉపాధ్యక్షులు టీవీ సుబ్బయ్య, ఓంకారం రాజు, రాఘవేంద్రరావు, పెంచలరెడ్డి, ప్రధాన కార్యదర్శి కలిశెట్టి రవీంద్రకుమార్, వెంకట కృష్ణయ్య, గంజి పెంచలయ్య, సుబ్బారెడ్డి, రామమోహన్‌రెడ్డి, వెంకయ్య, బండారు వెంకటేశ్వర్లు, అపర్ణా చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ దుకాణంలో చోరీ

అనుమానాలు వ్యక్తం చేస్తున్న పోలీసులు

కావలి: పట్టణంలోని ముసునూరులో ఉన్న ఓ సిమెంట్, ఐరన్ షాపులో రూ.1.50 లక్షల నగదు చోరీ జరిగినట్లుగా దుకాణ యజమాని తుళ్లూరు నరేంద్ర ఆదివారం కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే చోరీ జరిగిన తీరును పరిశీలించిన పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. షాపు వెనుక భాగంలోని రేకును పగులగొట్టి షాపు లోపలికి ప్రవేశించిన దొంగ క్యాష్ కౌంటర్ వద్ద ఉన్న పెద్ద గాజు గ్లాసును తొలగించి రూ.1.50లక్షల నగదును చోరీ చేసినట్లుగా దుకాణ యజమాని చెబుతున్నాడు. అయితే దొంగలు ఎవరైనా గాజుగ్లాసును పగులగొట్టి త్వరగా పని ముగించుకుని వెళ్లాలని చూస్తారు. కానీ స్క్రూలు తొలగించి గాజుగ్లాసు పక్కన పెట్టి ఉంది. అలా పెట్టే క్రమంలో దొంగ వేలిముద్రలు పడాలి. కానీ వేలిముద్రలు లేవు. వాటిని చెరిపినా అటువంటి ఆనవాళ్లు ఉండాలి. కానీ అలాంటి ఆనవాళ్లు లేవు. దుకాణ యజమాని రూ.1.50 లక్షలు చోరీకి గురైనట్లుగా ఫిర్యాదులో పేర్కొనగా, రూ.60వేలు మాత్రమే లావాదేవీలు జరిగినట్లుగా గుర్తించారు. పలు అనుమానాలు రేకెత్తిస్తున్న చోరీని కావలి రూరల్ పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సీఐటీయూ ధర్నా

ఆత్మకూరురూరల్: ప్రజాసమస్యల పరిష్కారానికి కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్య వేదిక, సీపీఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఉదయం 11 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని చెప్పారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.


20 మద్యం సీసాల స్వాధీనం

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ పరిధిలోని నరసారెడ్డిపాళెంలో నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై ఎస్సై ఉమాశంకర్ శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేకాట, కోడిపందాలు వంటి జూదాలు నిర్వహిస్తున్నా, నాటుసారా, మద్యం అక్రమ విక్రయాలు జరుపుతున్నా 94407 00098 నంబర్‌కు సమాచారం అందజేయాలని కోరారు. కానిస్టేబుళ్లు అశోక్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

శాంతకుమార్‌ది ఆత్మహత్యే?

కావలి: పట్టణంలోని ముసునూరులోని జగనన్నకాలనీ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఓ పక్కాగృహంలో ఈ నెల 22వతేదీ రాత్రి ముప్పవరపు శాంతకుమార్(35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు శాంతకుమార్ ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చారు. మద్యం సేవించి ప్రియురాలితో ఘర్షణకు దిగిన శాంతకుమార్ ఆమె వదిలి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది కిటికీకి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమిక విచారణలో నిగ్గుతేల్చారు.

30లోగా ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోవాలి



దుత్తలూరు: ఈ నెల 30లోగా పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాలను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో అనుసంధానం చేసుకోవాలని ఉదయగిరి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వీ సాయికృష్ణ సూచించారు. మండలంలోని ఏరుకొల్లులోని ఖాతాదారులకు ఎన్‌పీసీఐ లింకేజీపై ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు సంబంధించిన ప్రత్యక్ష నగదు బదిలీ ప్రయోజనాలు పొందాలంటే పోస్టల్ బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో తప్పనసరిగా అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. తపాల, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఎన్‌పీసీఐ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని వివరించారు.

సందడిగా కాపుల వనభోజన మహోత్సవం


చిన్నారుల నృత్య ప్రదర్శన


వన భోజనాలు చేస్తున్న కాపులు

కావలి: స్థానిక పెద్ద చెరువు వద్ద కాపుల వనభోజన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన కాపులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులు, పెద్దలు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధ్యాహ్నం సామూహికంగా వన భోజనాలు చేశారు.

ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ పోరాటం


విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

మర్రిపాడు: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటం సాగిస్తోందని ఆ సంఘ నేతలు పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవ మహాసభను ఆదివారం నిర్వహించారు. తొలుత యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు వీ మాలకొండయ్య, కే మస్తానయ్య, కేవీ రమణయ్య, పీ రామయ్య, కే అరుణమ్మ, జీ సుబ్బరాయుడు, పీ వెంకటసుబ్బయ్య, పీ సత్యం, ఎస్ చలమరాజు, బీ అనంతరామయ్య, వై గంగాధర్, జీ తిరుపతి, ఎం వెంకటసుబ్బయ్యను సత్కరించారు.

మండల నూతన కార్యవర్గ ఎన్నిక

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పీ విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కే సుధాకర్, కోశాధికారిగా ఎస్ వెంకటయ్య, మహిళా కార్యదర్శిగా టీ షనుమాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి హెచ్ మోహన్‌ప్రసాద్, జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ డైరెక్టర్ షేక్ నాయబ్, సీనియర్ నాయకుడు జీ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజోత్సవం


సంగంలో అయ్యప్పస్వామి పడిపూజోత్సవం


అనంతసాగరం మండలం రేవూరులో..

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులో అయ్యప్పస్వామి పడి పూజోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అయ్యప్పస్వామి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి విశేషాభిషేకాలు, పడి పూజ నిర్వహించారు. రేవూరు పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారులు విశేషంగా హాజరై భజనలు చేశారు.

సంగం: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అయ్యప్పస్వామి పూడి పూజోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంగం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అలాగే దువ్వూరులోనూ పడిపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్‌కు చెందిన పుల్లా రమణమ్మ(94) ఆదివారం మరణించారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి ట్రస్టు సభ్యులు కమల్ సింగ్, జోసఫ్ రూ.3 వేలు నగదు అందజేశారు. అంతిమ యాత్ర వాహనాన్ని ఏర్పాటు చేశారు.

నిరుపేద వృద్ధులకు నిత్యావసరాల వితరణ


వృద్ధులకు నిత్యావసరాలను అందజేస్తున్న దృశ్యం

కావలి: డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు ఆదివారం నిత్యాసర సరుకులను వితరణ చేశారు. పట్టణంలోని వెంగళరావు నగర్‌లోని డీఆర్ విశ్వోదయ సేవా సమితి కార్యాలయంలో 60 మంది వృద్ధులకు రూ.60 వేల విలువ చేసే సరుకులను అందజేశారు. కావలి మండల విద్యాశాఖ అధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. డీఆర్ విద్యాప్రదాత, గొప్పమానవతావాది అని కొనియాడారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవా సమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సేవా సమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ ,సతీష్‌సింగ్, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ కిరణ్‌కుమార్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు మోక్షమెన్నడో?

- అసంపూర్తిగా రైతుసేవా కేంద్రాల నిర్మాణాలు


దువ్వూరులో అసంపూర్తిగా నిర్మాణం


సంగంలో నిలిచిన నిర్మాణం

సంగం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసింది. రైతులకు ఇంటి ముంగిటకే అన్ని రకాల సేవలను అందించే లక్ష్యంతో ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటికి శాశ్వత భవన నిర్మాణాలకు నిధులను సైతం మంజూరు చేసింది. అయితే కొన్నిచోట్ల భవన నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని చోట్ల నిర్మాణాలు కొనసాగుతూ ఉన్నాయి. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చిందే తప్ప భవన నిర్మాణాలను పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో నిర్మాణాల పూర్తికి అధికారులు సైతం చొరవ చూపడం లేదు. దీంతో రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 87 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. అందులో 46 కేంద్రాలకు సంబంధించిన భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటికి సంబంధించి భవన నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయి ఉన్నాయి.

రైతుల సౌలభ్యం కోసం..

రైతుల సౌలభ్యం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసింది. ఆర్‌బీకేల్లో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లను నియమించి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సబ్సిడీపై యంత్ర పరికరాలు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, ఈక్రాప్ నమోదు, పంటల బీమా, ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు పరిహారం, తదితర సేవలను అందించింది. వెటర్నరీ అసిస్టెంట్లను నియమించి పాడి రైతులకు సేవలను సైతం అందించింది. రైతులకు సాగులో అండగా నిలిచే రైతుసేవా కేంద్రాల శాశ్వత భవన నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేయడంతో అటు సిబ్బంది, ఇటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతు సేవా కేంద్రాల సమాచారం

మండలం	మొత్తం కేంద్రాలు	భవనాలు పూర్తయినవి	నిర్మాణదశలో ఉన్నవి
సంగం	13	3	10
ఆత్మకూరు	14	5	9
మర్రిపాడు	16	15	1
చేజర్ల	15	7	8
అనంతసాగరం	16	11	5
ఏఎస్‌పేట	13	8	5
మొత్తం	87	46	41

ప్రభుత్వ ఆదేశాల కోసం చూస్తున్నాం

గత ప్రభుత్వంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న రైతు భరోసా కేంద్రాల నిర్మాణ విషయమై నూతన ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఆదేశాలు అందిన వెంటనే నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసులు, ఏఈ, పంచాయతీరాజ్, సంగం